ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 19 జూన్, 2026 | పేజీలు : 06

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించిన కెటిఆర్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** సిరిసిల్లలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, శాసనసభ్యులు కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సిరిసిల్లలో గురువారం పర్యటించి సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కుమారుడు అశ్విన్ రావు దశదిన కర్మ కు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఫుడ్ పాయిజన్ కు గురైన తంగళ్ళపల్లి మండలం కేసీఆర్ నగర్ కు చెందిన చిన్నారులను జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పరామర్శించి చిన్నారులకు ధైర్యం చెప్పి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వీరి వెంట బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ కళ చక్రపాణి, నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

# పవన్ కళ్యాణ్‌పై కేసు పెట్టేందుకు చేతకావడం లేదు

### ప్రజల కోసం పోరాటం చేసేవాళ్లపై కేసులు పెడతారు?
### పవన్ కళ్యాణ్ వెనుక బీజేపీ హస్తం
### తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
### కరీంనగర్‌లో ఉద్యమకారులతో రౌండ్ టేబుల్ సమావేశం




**ప్రజాపక్షం/కరీంనగర్:** 'ప్రజలకోసం పోరాటాలు చేసే వాళ్లపై కేసులు పెడతారు.. తెలంగాణ ప్రజలను ఉగ్రవాదులు, వేర్పాటు వాదులని అన్న ఏపి డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై మాత్రం కేసు పెట్టేందుకు చేత కావడం లేదని', పవన్ కళ్యాణ్ వెనుక బిజెపి హస్తం ఉందనే అనుమానం కలుగుతుందని.. తెలంగాణ లో పాగ వేసేందుకు బిజెపి మేక వన్నె పులిలా పావులు కదుపుతుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. కరీంనగర్ లో గురువారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు – సాధన అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు

వివరాలు 2లో

# డీర్ పార్కులో ఘనంగా వన మహోత్సవం



### మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మేయర్, నగరపాలక సంస్థ కమిషనర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు కరీంనగర్ నగరంలోని డీర్ పార్కులో బుధవారం సాయంత్రం ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు పలువురు అధికారులు మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మహిళలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలంటే మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని అధికారులు పిలుపునిచ్చారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగాన్ని డీర్ పార్కులో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, అధికారులు తిలకించారు. అంతకుముందు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్యమంత్రి సభను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, మెప్మా పీడీ స్వరూపారాణి, డీఆర్డీఓ గీత, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, స్ట్రైక్ ఫోర్స్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీతో పాటు పలువురు అటవీ శాఖ అధికారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మెనాల గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి గ్రామంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పర్యావరణం బాగుంటే సకాలంలో వర్షాలు పడి సమృద్ధిగా పంటలు పండుతాయని పర్యావరణ లోపంతోనే ప్రకృతి విపత్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న వేడి పర్యావరణ లోపంతోనే తలెత్తుతుందని మొక్కలు నాటి వాటిని పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుంబించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనభట్ల దినేష్ నాయకులు కార్యకర్తలు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఎంఐడీసీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై శాఖల వారీగా సమగ్ర నివేదిక సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావడంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు.అభివృద్ధి పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో అవసరమైన కొత్త ప్రతిపాదనలు ఏమైనా ఉంటే రూపొందించి సమర్పించాలని సూచించారు. ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.పనుల అమలులో ఎక్కడైనా క్రిటికల్ గ్యాప్స్ ఉన్నట్లయితే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలో జిల్లాలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి

వివరాలు 2లో



## ప్రథమ ర్యాంక్ సాధించడం ఎంతో అభినందనీయం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న మానాల రేవతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడం ఎంతో అభినందనీయమని గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో మానాల రేవతిని శాలువాతో సన్మానించి సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ 5000వేల రూపాయలు, ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి 5000వేల రూపాయల నగదును ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అదేవిధంగా పాఠశాలలను విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ భూమేష్, వార్డు సభ్యులు ముష్కరి, రమేష్ భూక్య శేఖర్, ముత్యాల గంగారాజం,అల్లి లతా చంద్రయ్య, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే డెంగి, మలేరియా నియంత్రణ సాధ్యం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వెక్టర్ జనిత వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి మండల వైద్యాధికారి డా. అల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీ రామకృష్ణ, ఎంపీఓ శ్రీ ప్రదీప్, సబ్ యూనిట్ అధికారి విలాయత్ బేగ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.సమావేశంలో గ్రామాలు,పట్టణ ప్రాంతాల్లో దోమల పెరుగుదలకు కారణమవుతున్న నిల్వ నీటి వనరులను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం "డ్రై డే" కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.డా. అంజిత్ రెడ్డి మాట్లాడుతూ డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేలు నిర్వహించి జ్వర బాధితులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎంపీడీఓ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీఓ శ్రీ ప్రదీప్ గ్రామస్థాయిలో ప్రజలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.వెక్టర్ జనిత వ్యాధుల నివారణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి మండలాన్ని వ్యాధి రహితంగా ఉంచేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ విభాగం, మరియు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో యోగ ఫర్ హెల్తీ ఏజింగ్ అనే ఇతివృత్తంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ యోగా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా ద్వారా ఒత్తిడి లేని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని పేర్కొన్న కలెక్టర్, జిల్లా ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.జూన్ 21వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుండగా, పాల్గొనేవారు ఉదయం 5.45 గంటలకు వేదికకు చేరుకోవాలని సూచించారు.యోగా శిక్షణ మరియు ప్రదర్శన అందరికీ పూర్తిగా ఉచితమని తెలిపారు. పాల్గొనే వారు తమ వెంట సొంత యోగా మ్యాట్ (చాప) లేదా తెల్లటి దుప్పటి తీసుకురావాలని, ఆసనాలు సులభంగా చేయడానికి అనువైన లూజ్ దుస్తులు ధరించి రావాలని సూచించారు.ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా సాధనను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జర్మనీలో ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా జర్మనీలో ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన సంస్థ నుండి డిప్లొమా ఇన్ ఫిజియోథెరపీ బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ విద్యార్హత కలిగి ఉండాలని, అలాగే రిజిస్ట్రేషన్ తర్వాత ఇటీవలి కనీసం రెండు సంవత్సరాల వృత్తిపరమైన అనుభవం ఉండాలని, అభ్యర్థుల వయస్సు 43 ఏళ్ల లోపు ఉండాలని, B2 స్థాయి జర్మన్ భాషా ధృవీకరణ తప్పనిసరి అని, టామ్ కామ్ ద్వారా A1 స్థాయి నుండి జర్మన్ భాషా శిక్షణ అందించబడుతుందని,ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి 2530 రోజుల వార్షిక సెలవులు, జర్మన్ లైసెన్స్ పొందడానికి ముందు నెలకు సుమారు రూ. 2,74,000 3,17,000 లైసెన్స్ పొందిన తర్వాత నెలకు సుమారు రూపాయలు 3,35,000 నుండి 3,80,000 వరకు వేతనం అందుతుందని, అలాగే యజమాని చెల్లించే పూర్తి ఆరోగ్య భీమా సదుపాయం కల్పించబడుతుందని, జర్మన్ భాషా శిక్షణ, పూర్తి పత్రాల తయారీ ప్రక్రియ, వీసా సహాయం వంటి సదుపాయాలను టామ్ కామ్ సంస్థ అందిస్తుందని ,ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను tomcomglobal@gmail.com మెయిల్ ఐడికి పంపాలని, జూన్ 30వ తేదీలోపు దరఖాస్తులు పూర్తి చేయాలని, మరిన్ని వివరాల కోసం 9440049645, 9440052081,9440051763, 9440052592 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రామాల రూపురేఖలు మార్చే పనులకు రూ.4.47 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** కోరుట్ల నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కృషితో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం రూ.4 కోట్ల 47 లక్షల నిధులు మంజూరయ్యాయి. గ్రామాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ఈ నిధులను వినియోగించనున్నారు. మంజూరైన నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, "కోరుట్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కట్టుబడి ఉన్నాం అని తెలిపారు.

## ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



**ప్రజాపక్షం/రామగిరి:** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో గురువారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, తో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఉన్న యోగా మందిరం పై రేకులు మార్చి ఫ్లోర్ టైల్స్ వేయడం, ఓసిపి1, ఓసిపి2, ఏ ఎల్ పి లలో ఉన్నటువంటి స్క్రాప్ ను సేల్ చేయడం, జీడీకే 10 వ గని మూసి వేస్తున్నందుకుగాను అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఓ సి 1, ఓసి 2 లకు బదిలీ చేయడం, సీఎం పిఎఫ్ లో కొత్త విధానం 2018 నుండి పేమెంట్ టైటిల్స్ ఉంటేనే పెన్షన్ ఇస్తామని అంటున్నారని, సరిగా పనిచేయడం లేదని కొత్త ఏసీలను అమర్చాలని, జీఎం కార్యాలయం, ఓసిపి1,ఓసిపి2, అడ్రియాల లాంగ్ వాల్ లలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాల కోసం చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం, ఓసిపి2 ఉపరితల గని నుండి మెయిన్ రోడ్డు కు వెళ్లే రోడ్డుపై ఆర్ అండ్ బి వారిచే స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయించడం, అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో గల ఆర్వో ప్లాంట్ను మరమ్మతులు చేయించడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు ఎ.రామారావు, తిరుపతి, సాయికృష్ణ, ఎన్.శ్రీనివాస్ రావు, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్,ఐ ఇ డిజియం బి.టి. మురళీ కృష్ణ, డివైపియం వంశీధర్, పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌పై కేసు పెట్టేందుకు చేతకావడం లేదు

మొదటి పేజీ తరువాయి

తీర్మానాలను చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక తెలంగాణ ఆనవాళ్లను పక్కన పెడుతున్నాడని, అందుకే పక్క రాష్ట్రం నుంచి పెత్తనం కోసం వస్తున్నారని అన్నారు. ఆంధ్ర నాయకుల విగ్రహాలు పెడుతూ ఇక్కడి నాయకుల విగ్రహాలను విస్మరిస్తున్నారని అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా మన హక్కుల కోసం పోరాడటం ఆవేదన కలిగిస్తోందని, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ఉద్యమకారులకు అన్ని చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చలనం లేదని,ఉద్యమకారులను గుర్తించటానికి ప్రభుత్వం 30 నెలల కాలం గడిపిందని, 12 వందల మంది అమరులైతే పట్టించుకోలేదంటూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇదే కాంగ్రెస్ ఆడిపోసుకుందని, కానీ వీళ్ల అధికారంలోకి వచ్చి 30 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు పట్టించుకోలేదని విమర్శించారు. గద్దరన్న పేరుతో సినిమా అవార్డులు కాకుండా ఆయన పేరుతో జానపద అకాడమీ పెట్టి కళాకారులకు అవార్డులు ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని అప్పటి ప్రభుత్వం పెట్టలేదని, ఈ ప్రభుత్వం కూడా పెట్టటం లేదన్నారు. కరీంగనర్ లో తెలంగాణ తల్లీ విగ్రహం లేకుండా చేశారని అన్నారు.

**పవన్ కళ్యాణ్ వెనుక బిజెపి హస్తం..**

పవన్ కళ్యాణ్ వెనుక బిజెపి హస్తం ఉందని, తెలంగాణలో పాగ వేసేందుకు బిజెపి మేక వన్నె పులిలా వస్తోందన్నారు. బీజేపీ వస్తే మన ఊరి దేవుళ్లను మాయం చేస్తారని, మైసమ్మ, దుర్గమ్మ లాంటి దేవతలు ఉండరని, ఒకటి, రెండు దేవుళ్లను మాత్రమే పూజించాల్సి ఉంటుందని, తెలంగాణలో ఎవరి దేవున్ని వాళ్లు పూజించుకునే మంచి సంస్కృతి ఉందని, అలాంటి సంస్కృతిని చెడగొట్టాలనుకుంటున్న బీజేపీని పొలిమేరకు కూడా రానివ్వొదన్నారు.వాళ్ల కుట్రలను తెలంగాణ సమాజం గమనించి అప్రమత్తంగా ఉండాలన్నారు.

తన పార్టీలో కోటరీ లేకుండా జాగ్రత్త పడతానని, తాను కూడా కోటరీకి బలైన వ్యక్తేనని అన్నారు. మొదటి నుంచి పనిచేసిన వాళ్లకు టికెట్ ఇవ్వరని అంటున్నారని, బీఆర్ఎస్ లో అదే జరిగిందని, కరీంనగర్ లో చూస్తే ఉద్యమకారుల మీద జులుం చేసిన గంగుల కమలాకర్ ను బీఆర్ఎస్ నెత్తిన పెట్టుకుందన్నారు. చాలా చోట్ల ఉద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్లకే బీఆర్ఎస్ టికెట్లు ఇచ్చిందన్నారు. బీసీలు జనరల్ సీట్లలో పోటీ చేసే పరిస్థితి రావాలని, ఎక్కడైనా బీసీలు, ఎస్సీలు పోటీ చేయగలిగితేనే అది మంచి తెలంగాణ అవుతుందన్నారు. తెలంగాణకు రక్షణ సేనకు ఒక అవకాశం ఇవ్వండని, మార్పు ఎలా ఉంటుందో చూపిస్తానన్నారు. పార్టీలో కచ్చితంగా 33 శాతం సీట్లను మహిళలకు ఇస్తామనని, మహిళ నాయకులను తయారు చేసి భవిష్యత్ లో 50 శాతం సీట్లు ఇచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయి నిపుణులతో చర్చించి అందుకు కావాల్సిన బడ్జెట్, ప్రణాళిక అన్ని తెలుసుకున్నాకే ఉచిత విద్య, వైద్యం గురించి ప్రకటించానన్నారు. పార్టీలో అన్ని వర్గాల వారిని కలుపుకు పోతామని తెలిపారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి

మొదటి పేజీ తరువాయి

సమర్పించాలని సూచించారు.అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో , ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఆర్ అండ్ బి ఈఈ భావ్‌సింగ్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్,కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/రామగిరి:** రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు కెక్కర్ల సాయిబాబా ఇటీవల తాటి చెట్టుపై నుండి ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనకు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బేగంపేటలోని సాయిబాబా నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేషి. రవీందర్ , నాయకులు పాల్గొన్నారు.

## మేడలు, ప్లాస్టిక్ బొమ్మలు చూసి మోసపోవద్దు

ప్రముఖ విద్యావేత్త మహమ్మద్ అంకుష్



**ప్రజాపక్షం / జమ్మికుంట :** అద్దాల మేడలు, ప్లాస్టిక్ బొమ్మలు మీ పిల్లల భవిష్యత్‌ను మార్చలేవని పిల్లకు కావాల్సింది చదువు మాత్రమేనని పొందాల్సింది విజ్ఞానం అని గార్డియన్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రముఖ విద్యావేత్త మహమ్మద్ అంకుష్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల చదువు కోసం లక్షల రూపాయలు వెచ్చించి అనవసరంగా ఆర్థిక నష్టాలు పొంది అప్పులపాలవుతున్న పరిస్థితి నేడు తెలంగాణ రాష్ట్రంలో ఉందని ఇలా ఎందుకు జరుగుతున్నది అంటే నేను పెద్ద స్కూల్లో చదువుతున్న మా పిల్లగానికి ఎక్కువ ఫీజు కడుతున్న అనేటువంటి స్టేటస్‌కు వెళ్లి హంగులు ఆర్భాటాలు చూసి మోసపోతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ముఖ్యంగా గమనించాల్సింది పిల్లకు మంచి చదువు, క్రమశిక్షణ ఉత్తమ విద్యార్థిగా రూపొందడం అంతేకానీ పెద్ద బిల్డింగులో మా పిల్లగాడు చదువుకుంటున్నాడు అని అక్కడ అద్దాల మేడలు ఉన్నవని ప్లాస్టిక్ బొమ్మలు ఉన్నాయని చెప్పి ఆర్థిక నష్టాలకు కొని తెచ్చుకుంటున్నారని వాపోయారు. జమ్మికుంట పరిసర ప్రాంత తల్లిదండ్రులు ముఖ్యంగా గమనించాల్సింది కొత్తపల్లి నందు గార్డియన్ స్కూల్లో 50 శాతం ఫీజు రాయితితో ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఇంగ్లీష్ విద్యను గత మూడు సంవత్సరాల నుంచి అందిస్తున్నామని ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పెద్దమ్మతల్లి బోనాల జాతర



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలోని ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి గురువారం అంగరంగ వైభవంగా బోనాల జాతర కన్నుల పండుగ జరిగింది.ఈ కార్యక్రమానికి ముదిరాజ్ కుల పెద్దలతోపాటు గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి,ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ బక్కారావు తదితర నాయకుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని,ఆటపాటలు, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పెద్దమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా భక్తులు పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామానికి సుఖశాంతులు, సస్యశ్యామలం కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువకులు, మహిళలు, ముదిరాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కందుల నరేష్,నరేడ్ల సదానందం,నరేడ్ల స్వామి,నరేడ్ల రమేష్, కార్యదర్శి కొండిల్ల ఉమేష్,ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బక్కరావు,ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్,వార్డు సభ్యులు పూదరి స్వప్న,పొలవేణి రవళి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపికైన పారమిత విద్యార్థి




**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సిసిఆర్) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2025 26 కు స్థానిక కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ ఎంపికయ్యాడని పాఠశాల డైరెక్టర్ రశ్మిత తెలిపారు. దక్షిణ భారతదేశం మొత్తం మీద కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికవగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిగా కిట్ల చరణ్ ఈ ఘనత సాధించాడు. ఈ ఎంపికలో భాగంగా చరణ్‌కు అతని డిగ్రీ పూర్తయ్యేవరకు ప్రతి సంవత్సరం ఈ జాతీయస్థాయి స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికిగాను విద్యార్థి చరణ్‌కు రూ.3500 అతనికి శిక్షణ ఇచ్చిన సంగీత ఉపాధ్యాయునికి రూ.9000 కలిపి మొత్తంగా రూ.12,500 లభించనున్నాయని ఈ మొత్తం ప్రతి సంవత్సరం పెరుగుతుందని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటి పాఠశాలకే కాకుండా రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన కిట్ల చరణ్‌ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అ నూకర్ రావు, రశ్మిత, వినోద్ రావు, వియుఎం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, సంగీత, ఉపాధ్యాయులు జితుమణిశర్మలు విద్యార్థిని అభినందించి భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కార్మికుల దీక్షకు మద్దతు తెలిపిన మున్సిపల్ చైర్మన్



**ప్రజాపక్షం / జమ్మికుంట :** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆదేశానుసారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ కొలుగురి తిరుపతి, శ్రీనివాస్,రాసపల్లి సంజీవ్, మరేపల్లి ప్రశాత్ తదితరులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఆశిస్తున్న న్యాయమైన డిమాండ్లకు తాను మద్దతు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో పని చేసే ఔట్ సోర్సింగ్ ఎన్ఎంఆర్ ఫిక్స్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2వ పిఆర్సి ప్రకటించి కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి కేటగిరి వేతనాలు అమలు చేయాలి. కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా డబుల్ బెడ్‌రూం ఇందిరమ్మ ఇండ్లు, స్థలాలు ఇవ్వాలన్నారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చులకు రూ.30 వేలు ఇవ్వాలని, కార్మికులకు ఒక్కపూట 8 గంటల పని విధానం అమలు చేయాలని ప్రతి సంవత్సరం మున్సిపల్ లో పని చేసే శానిటేషన్, వాటర్ వర్క్స్ హరితహారం, ఎలక్ట్రిషన్ డ్రైవర్లకు రక్షణ పరికరాలు అందజేయాలని, మున్సిపల్ పరిధిలో పనిచేసే డ్రైవర్లకు, జవాన్లకు మిగతావారి వలే డ్రైవర్స్ కేటగిరి వేతనం ఇవ్వాలని అన్నారు. కార్మికులు చేస్తున్న దీక్షకు తమవంతు సహకారం ఉంటుందని ప్రభుత్వ అధికారుల సృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొలుగురి సురేశ్, ఫిరోజ్, మంద రాజేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలా

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై కొప్పుల ఈశ్వర్ ధ్వజం




**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించిన మాజీ మంత్రి టి.హరీశ్ రావుకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు సామాన్య పౌరుడు ప్రశ్నించినా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంటుందని అన్నారు. అలాంటిది ఒక మాజీ మంత్రి హరీశ్ రావు, ప్రవీణ్ కుమార్ భారీ కుంభకోణం విషయంలో చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాల్సింది పోయి వారి వ్యక్తిగత విషయాలపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దమ్ముంటే మంత్రి పదవి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. అతికష్టం మీద ఎమ్మెల్యేగా ఒకసారి గెలిచిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాజీనామా చేసే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలపై ఇప్పటికైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు మాజీ మేయర్ సర్దార్ రవిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా బొంపల్లి గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే బొంపల్లి లో సర్వే చేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యుల వారి విద్యా అర్హతల గురించి, చదువు మానేసిన, ఉన్నత చదువులు, వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి, వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో, ఎన్ని గంటలు పని చేశారో, ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలు నిరంతర పక్రియ , కావున ప్రజలు అందరూ గణాంక శాఖ అధికారులకు సహకరించాలి. ఈ కార్యక్రమంలో బొంపల్లి గ్రామ సర్పంచ్ దాడి మౌనిక సంపత్ యాదవ్ ఉప సర్పంచ్ పంబాల రాజు,వార్డు సభ్యులు అంగన్వాడి టీచర్ కడారి కనక లక్ష్మి గ్రామ ఏఎన్ఎం నగూరి రాజేశ్వరి ఆశ వర్కర్ సంటి లలిత గ్రామపంచాయతీ సిబ్బంది శ్రీకాంత్, అనిల్, పాల్గొన్నారు.

## బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్ మొలుగు ప్రశాంత్

**ప్రజాపక్షం / జమ్మికుంట :** జగ్గయ్యపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ భూలక్ష్మీ, మహాలక్ష్మీ నాభిశిల (బొడ్రాయి) ఉత్సవాలలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు. సర్పంచ్ ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అమ్మవార్లను కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో పూజిస్తారని వారందరికీ శ్రీ భూలక్ష్మీ ,మహాలక్ష్మీ నాభిశిల అమ్మవార్ల ఆశీర్వాదం ఉండాలని అన్నారు. జగ్గయ్యపల్లి గ్రామ ప్రజలు జమ్మికుంట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద రాజేశ్, శంకర్, కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ వంశీధర్, అనిల్, శ్రీనివాస్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక నిల్వలను సీజ్ చేసిన పోలీసులు

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును టాస్క్‌ఫోర్స్ కొత్తపల్లి పోలీసులు పట్టుకున్నారు. కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల గ్రామంలో కిసాన్ మినీ మాడ్రన్ రైస్ మిల్లులో ఇసుక నిల్వలు ఉన్నాయని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ కొత్తపల్లి పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. సుమారు 30 ట్రాక్టర్ నిల్వలు ఉన్నాయని పోలుసులు తెలిపారు. ఈ దాడులలో టాస్క్ ఫోర్స్ ఎస్సై సురేందర్, కొత్తపల్లి ఎస్సైలు రాజయ్య, సంజీవ్ రావు తదితరులు ఉన్నారు.

## వేల్పమ్మ తల్లికి మొక్కులు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలోని రెండో వార్డు ఎస్టి కాలనీకి చెందిన గిరిజన కులస్తుల ఆధ్వర్యంలో వేల్పమ్మ తల్లికి గురువారం అంగరంగ వైభవంగా మేకలను బలిచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కుల పెద్దలు మాట్లాడుతూ మృగశిల కార్తిలో కులస్తులందరితోపాటు గ్రామస్తులు ఆ తల్లి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ తల్లిని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో కుల పెద్దలు పోలం పోషాలు,బొమ్మిడి మల్లేష్,పొలం గట్టయ్య,భీముని నగేష్,కూన రాజేందర్,తోట దివాకర్,జంగ మెండయ్య,పొలం కిరణ్,సంతోష్,తోపాటు తదితరులున్నారు.

## రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు ఉండవు

**ప్రజాపక్షం/ముత్తారం :** రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు,శాశ్వత మిత్రత్వాలు ఉండవనే సామెతను పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామం నిజం చేసి చూపించింది. నిన్నటివరకు ఎన్నికల రణరంగంలో ఒకరిపై ఒకరు నానా బూతులు తిట్టుకుంటూ,కత్తులు దూసుకున్న స్థానిక రాజకీయ నాయకులు నేడు ఒక్కటయ్యారు.ఓడేడ్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శత్రుత్వాన్ని మరిచి ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆత్మీయంగా కలుసుకున్నారు.ఈ దృశ్యాన్ని చూసిన ఇత్తర పార్టీల నాయకులు,స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఎన్నికల సమయంలో కుమ్ములాడుకున్న పెద్ద లీడర్లంతా ఇప్పుడు కలిసిపోయారు..కానీ వారి మాటలు నమ్మి ఒకరితో ఒకరు "గొడవపడి,విడిపోయిన సామాన్య జనమే ఇప్పుడు దూరమయ్యారు అంటూ స్థానికులు గుసగుసలాడుకుంటూ నవ్వుకోవడం ఇక్కడ విశేషంగా మారింది.!

## గ్రామంలో నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభం

**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** తెర్లుమద్ది గ్రామంలోని గ్రామ పంచాయితీ నిధులతో సుమారు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన రోజువారీ కూరగాయల మార్కెట్‌ను సర్పంచ్ బైతి దుర్గవ్వ ప్రారంభించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేయటంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ దుర్గవ్వకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సౌజన్య, వార్డు సభ్యులు బద్ధ రాములు, చిర్రం మహేష్, నెత్తేట్ల రమాదేవి, కొమ్మెట రాజు, కొమ్మెట రాజలింగయ్య, అంతడుపుల మంజుల దేవయ్య, కొండం విష్ణు, జంపెల్లి తిరుపతి, గోక దివ్యస్వామి, మామిండ్ల కానుకవ్వ శ్రీనివాస్ తో పాటు గ్రామ ప్రజలు, కూరగాయల వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డుమధ్య ఎయిర్ వాల్వ్.. ప్రమాదానికి ఆహ్వానం..!

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ ప్రధాన రహదారిపై రోడ్డుమధ్యలో ఉన్న మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ వాహనదారులకు ప్రాణాపాయంగా మారింది. ప్రజాపక్షం దినపత్రిక రెండు నెలల క్రితమే సమస్యను వెలుగులోకి తీసుకొచ్చినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మండల కేంద్రం నుండి మల్లాపూర్ మండలంలోని సిరికుడవరకు ప్రధానమంత్రి సడక్ యోజన కింద రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ రోడ్డుకు తారు వేయకముందే మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్‌ను రోడ్డుకు క్రింది సైడ్ కు ఏర్పాటు చేసినట్లయితే రోడ్డుకు నష్టం జరగకుండా ఉండడంతోపాటు రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలను నివారించినట్లు కూడా అవుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ఎయిర్ వాల్వ్‌ను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దేవలయాల కమిటీ చైర్మన్ కిరణ్‌కు సన్మానం

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో దేవలయాల కమిటీ చైర్మన్ గా ఎన్నికైన యువ న్యాయవాది కోటగిరి కిరణ్ ను గురువారం గ్రామంలోని గ్రామ కళవేదిక ప్రాంగణంలో నాయకులు సున్నం సత్యం,దోనికెన నారయణ లు శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోటగిరి రమేష్,ఎడిపెల్లి మురళి,బస సోమయ్య,సున్నం రాకేశ్, పొన్నం గణేష్,చిట్యల రాజు,సెరిసెల మహేష్, కోత్తురి సుధకర్, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార లోపంతో ఖాళీ కుర్చీలే దర్శనం

ప్రజాపక్షం/మల్లాపూర్ : ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అన్ని పార్టీల నాయకులు ప్రజలను, యువతను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఉన్నత స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులకు కిందిస్థాయి సిబ్బందికి సూచిస్తున్నప్పటికీ గురువారం చేపట్టిన ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమం ప్రజలకు తెలియక పోవడం,సమాచార లోపంతో చాలా వరకు ప్రజలు ఎవరు రాకపోవడంతో కాలి కుర్చీలే దర్శనమిచ్చాయి. బి.ఎల్.ఓలు,ఆయా పార్టీల నాయకులు తప్ప సామాన్య ప్రజలు ఎవరు కూడా హాజరు కాక పోవడం ఎస్ఐఆర్ ప్రక్రియ అవగాహనపై సరైన ప్రచారం లేకపోవడంతోనే సంబంధిత అధికారుల లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది.

# భూమికి సరిహద్దులు ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/కొడిమ్యాల : మండలంలోని రాంసాగర్ రెవెన్యూ శివారులో ఉన్న డబ్బు తిమ్మయపల్లి గ్రామానికి చెందిన తిరుమలయ్య కుంట చెరువు భూమికి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని గ్రామ సర్పంచ్ సురకంటి లావణ్య తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.చెరువు సర్వే నంబర్ 52లో ఉందని, చెరువు భూమి అన్యాక్రాంతం కాకుండా గ్రామస్తులు పరిరక్షిస్తున్నారని పేర్కొన్నారు. చెరు వు భూమికి వెంటనే సర్వే నిర్వహించి అధికారిక హద్దులు నిర్ణయిం చి, ప్రభుత్వ భూమిని పరిరక్షించే చర్యలు చేపట్టాలని ఆమె వినతిలో కోరారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ డబ్బు జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ముత్యం రెడ్డి, గండి హరికృష్ణ పాల్గొన్నారు.

# ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యంగా పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, ప్రాథమిక గణితంలో కనీస నైపుణ్యాలను సాధించేలా లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అందించి, ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పిల్లల్లో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. 202627 విద్యా సంవత్సరానికి ప్రతి కాంప్లెక్స్ స్థాయిలో లక్ష్యాలు నిర్దేశించుకోవాలని,ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రతి పాఠశాలకు ప్రత్యేక లక్ష్యాలు నిర్ణయించి వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్ఎంలు,ఉపాధ్యాయులు అందరూ ఒక బృం దంగా పని చేసి ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యాన్ని చేరుకోవాలని, విద్యా సంవత్సరం మొత్తం ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. గత ఏడాది జిల్లాకు మంచి ఫలితాలు వచ్చాయని, ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధిని ఉపాధ్యాయులు తమ బాధ్యతగా స్వీకరించాలని, పాఠశాలల్లో ఎదురయ్యే ఏ సమస్యనైనా ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే కాం ప్లెక్స్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్మెంట్ చేసుకుని, ఆ విషయా న్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, అకడమిక్ అధికారి పి.ఎం. షేక్, అధికారులు పాల్గొన్నారు.

# యూరియా యాప్‌ను రద్దు చేయాలి

## నేరెళ్ల బాధితులను ఆదుకుంటాం

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : తెలంగాణ రాష్ట్రంలో పేదలకు చదువు కోసం ఏ ఒక్క రూపాయి కూడా ఖర్చు కావద్దని, ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లి రూపాయి ఖర్చు లేకుండా వైద్యం చేసుకుని విధంగా ఆలోచించి ఉచిత ఉచిత వైద్యం అందిస్తామని టి ఆర్ ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం సిరిసిల్లలో అంబేద్కర్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించి బహిరంగ సభలో మాట్లాడారు. పాంచ జన్యం పేరుతో మీ ముందుకు వస్తున్నామన్నారు. చదివిన ఆడపిల్లలకు మగ పిల్లలకు గ్రూప్స్ పెట్టి రెండు లక్షల నుండి 20 కోట్ల వరకు ఏ బిజినెస్ చేసుకున్న వారికి లోన్లు ఇస్తామని, యూత్ కు యూత్ ఎంపవర్మెంట్ కింద లోన్ ఇస్తామని అన్నారు. సిరిసిల్ల వేదికగా యూరియా యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డగా ఆడవాళ్ళ సమస్యలు నాకు తెలుసని నేను సిరిసిల్లకు వస్తుండగా వారి సమస్యలు ఆడవాళ్లు నాకు చెప్పుకున్నారని పేదవాళ్ళకి ఇందులేవని అన్నారని, ఇవన్నీ సమస్యలు పరిష్కరించడానికి తెలంగాణ రక్షణ సేన పేరుతో మీ ముందుకు వస్తున్నామని మా పార్టీని ఆదరించాలని అన్నారు. ఈ జెండా పసుపు రంగు జెండా పసుపు ఆడవాళ్ళకి పవిత్రమైన రంగని, పసుపు రంగులో తెలంగాణ నీలం రంగులో ఉందని నీలం రంగు బడుగు బలహీన వర్గాల పేదల రంగని వర్ణించారు. ముఖ్యమంత్రి తరువాత ముఖ్యమంత్రిగా చలామణి అయిన కేటీఆర్ సిరిసిల్లకి కాళేశ్వరం ప్రాజెక్టు నుండి ఒక లక్ష ఎనిమిది వేల ఎకరాలకు రైతులకు నీరు అందించాలి కానీ 480 ఎకరాలకు మాత్రమే నీళ్ల అందించాలని ఎద్దేవ చేశారు. ప్రతి షెడ్డు లో లూమ్ బిగించితే సిరిసిల్ల నేతన్నలు ఓనర్ అయ్యేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులు సిరిసిల్ల లో ఉంటే యార్న్ డిపో వేములవాడ లో రాజకీయ లబ్ధి కోసం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పై యుద్ధం చేస్తామని అందరిని ఎండగడుతూ టిఆర్ఎస్ జండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెండా పండగ జిల్లా ఇన్చార్జ్ మజీద్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జిలు గుంటుక సంపత్, బుస వేణు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలి

ప్రజాపక్షం/గొల్లపల్లి : ఐదేళ్ల లోపు చిన్నారులందరినీ అంగన్వాడి కేంద్రంలో చేర్పించాలని చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి కేంద్రాలు అంగన్వాడీ కేంద్రాలు బలమైన పునాదులు అని సర్పంచ్ తిరుపతి గౌడ్ అన్నారు.గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రాల్లో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు .కార్యక్రమంలో రెండున్నర సంవత్సరాల నుండి నాలుగు సంవత్సరాల వయసుగల చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి గౌడ్ మాట్లాడుతూ బాల్యంలోనే విద్యకు బలమైన పునాది వేయడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.అంగన్వాడి కేంద్రంలో టీచర్లు పిల్లలకు ఆటపాటలు కథలతో కూడిన ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం ఆరోగ్య పరీక్షలు మానసిక వికాసం సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. .ప్రీ స్కూల్ కు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు .ప్రతి తల్లి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని సూచించారు.కొత్తగా నమోదైన పిల్లలకు సూపర్వైజర్ జానకి తో కలిసి అక్షరాభ్యాసం చేయించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ ,సూపర్వైజర్ జానకి,అంగన్వాడి టీచర్లు గంగ భవాని,నర్సుదా,ఆయమ్మలు జి లక్ష్మి ,శ్రీలత ,జమున,వివో ఏలు వాణి సులోచన తల్లులు పిల్లలు గర్భిణీలు చిన్నారులు గ్రామ ప్రజలు,పాల్గొన్నారు.

# ఖమ్మంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పర్యటన

ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల తో గురువారం ధర్మపురి కౌన్సిల్ సభ్యులు ఖమ్మం లో పర్యటించారు.ధర్మపురి మున్సిపాలిటీ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన, వైస్ చైర్పర్సన్ ఇందారపు రామన్న , కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,శానిటరీ ఇన్స్పెక్టర్ లు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్ ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్యటించారు. ఖమ్మం నగరంలోని ఘన వ్యర్థాల నిర్వహణ (Solid Waste Management) ప్రాసెసింగ్ ప్లాంట్లు ను సందర్శించి,అక్కడ నిర్వహిస్తున్న శాస్త్రీయ విధానాలను పరిశీలించారు. డంపింగ్ ప్రక్రియ కాకుండా చెత్తను మూలం వద్దనే వేరు చేసి, ప్రాసెసింగ్ ద్వారా రీసైక్లింగ్ మరియు బయోమైనింగ్ పద్ధతుల ద్వారా RDF (Refuse Derived Fuel), ఇనర్ట్ వ్యర్థాలు మరియు బయోసాయిల్ రూపంలో విలువైన ఉత్పత్తులుగా మార్చడం జరుగుతున్నట్లు అధికారులు వివరించారు.అదేవిధంగా, లకారం చెరువు వద్ద చేపట్టిన సిటీ బ్యూటిఫికేషన్ అభివృద్ధి పనులు, రైతు బజార్, స్ట్రీట్ వెండర్ జోన్లు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మరియు అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించి వాటి నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు అయ్యోరి వేణుగోపాల్, పవన్ వాంకుడోత్ విజయ, జింజర్ కానీ సువర్ణ, వీర వేణి నాగలక్ష్మి ,జక్కు పద్మ ,సుక్క సంధ్య ,చీపిరిశెట్టి రాజేష్, ఒజ్జల లక్ష్మణ్ ,తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలో దోపిడీ అరికట్టాలి




ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో దోపిడీని అరికట్టాలని ABVP స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మాల్యాల రాకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీవీపీ జగిత్యాల ఆధ్వర్యంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ DEO ఆఫీస్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న MEO,DEOలు లేని కారణంగా ఉన్న ఇన్చార్జి DEO లు కనీసం పట్టించుకోకుండా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు వత్తాసు పలకడం చాలా బాధాకరమని అన్నారు. పా ఠ్యపుస్తకాలను పాఠశాలలో అమ్ముతూ విద్యను పూర్తిగా వ్యాపారంగా మారుస్తున్నప్పటికీ అధికారులు,రాష్ట్ర ప్రభుత్వమే మొద్దు నిద్ర వహిస్తుందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా MEO,DEO ,టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నందువల్ల ఎంతో మంది విద్యార్థులు అ న్యాయానికి గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రా ష్ట్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తుందని తెలిపారు నిర్ణయాలను వెనక్కి తీసుకొని ప్రభుత్వ పాఠశాలలను సాంఘిక సంక్షేమ హాస్టల్ లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి హాస్టల్లకు పక్కా భవనాలను నిర్మించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మాదవేణి సునీల్, మారుతి కార్యకర్తలు ప్రణీత్ అజయ్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పారదర్శకంగా చేపట్టాలి



ప్రజాపక్షం /మల్లాపూర్ : ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుగుణంగా ఎస్. ఐ .ఆర్ ప్రక్రియను ప్రతి ఒక్క బి ఎల్ వో లు పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్ఓ లకు శిక్షణ కార్యక్రమం చేపట్టగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ హాజరై అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వేలో ప్రతి ఓటర్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారి పేర్లను జాబితాలో నమోదయ్యేలా చూడాలని, ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డిఓ జీవాకర్ రెడ్డి తహసీల్దార్ ఎంపీడీవో సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులున్నారు.

**కలెక్టర్ వచ్చిన పది నిమిషాలకు ఆలస్యంగా ఎంపీడీవో :** ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సకాలంలో హాజరుకాగా కలెక్టర్ స్టేజి పైకి వచ్చిన పది నిమిషాలకు ఆలస్యంగా ఎంపీడీవో స్థాయి అ ధికారి రావడం అక్కడే ఉన్న ప్రజాప్రతినిధులను ఆశ్చర్యానికి గురిచేసి ంది. ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా ఇలా కలెక్టర్ వ చ్చిన అనంతరం మండల స్థాయి అధికారి సమయానికి రాకపోవడం స మంజసమేనా అంటూ అక్కడే ప్రజా ప్రతినిధులు గుసగుసలాడారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి

**ప్రజాపక్షం / మందమర్రి :** బాల్య వివాహాలు బాలల భవిష్యత్తును చీకటిలోకి నెట్టివేసే సామాజిక దురాచార మని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధి కారులు పిలుపునిచ్చారు. మందమర్రి మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామంలో గురువారం ఉపాధిహామీ పథకం కార్మికులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, మానసిక వికాసంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని వివరించారు. చిన్న వయస్సులో వివాహం జరగడం వల్ల బాలికలు విద్యకు దూరమవడంతో పాటు ఆరోగ్య సమస్యలు, పోషకాహార లోపం, ప్రసూతి సమయంలో ప్రాణాపా య పరిస్థితులు ఎదుర్కొనే ప్రమాదం ఎక్కువగా ఉం



టుందని తెలిపారు. ప్రభుత్వం బాల్య వివాహాల నివా రణ కోసం అమలు చేస్తున్న చట్టాలు, రక్షణ చర్యలు, మహిళల హక్కులు, సఖి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల గురించి కార్మికులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత లకు లేదా హెల్ప్‌లైన్‌లకు తెలియ జేసి వాటిని అడ్డుకోవాలని సూచించారు. సమాజంలో బాలికలకు విద్య, స్వయం సాధికారత, సమాన అవకా శాలు కల్పించడం ద్వారానే బాల్య వివాహాల నిర్మూ లన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు కలిసి పని చేస్తేనే బాల్య వివాహాల రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. బాలికల హక్కులను పరి రక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, బాల్య వివాహాల నిర్మూలన కోసం గ్రామ స్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృ తంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉమెన్ హబ్ అధికారి లిప్సిక, జనరల్ స్పెషలిస్ట్ విజయ, ఈజీ ఎస్ ఈఆర్పీ రమేశ్, గ్రామ సర్పంచ్ పున్నం, ఉపాధి హామీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం / కాసిపేట :** నిత్యం యోగ సాధన చేయడం ద్వారా మధుమేహం, రక్తపోటు, పక్షవాతం వంటి అనేక వ్యాధులను నివా రించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకో వచ్చని దేవాపూర్ సర్పంచ్ సిడాం రాందాస్ తెలిపారు. గురువారం కాసిపేట మండలం దేవాపూర్ ఏజెన్సీ గ్రామపంచాయతీ ఆవరణ లోని కమ్యూనిటీ హాల్‌లో యోగ మాస్టర్ రామకృష్ణ ఆయుష్మాన్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులకు యోగాసనాలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయక పోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ కల్తీ ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ తగ్గిపోవడం, అధిక బరువు వంటి కారణాలతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ యోగను తమ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాపూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిడం రాందాస్, యోగ మాస్టర్ రామకృష్ణ, డాక్టర్ నాగార్జున, గీతాదేవి, కొమ్ముల బాపు, కొమురం జనార్ధన్, రాయి సెంటర్ ఉపమేడి ఆత్రం జంగు, తుడుం దెబ్బ గౌరవ అధ్యక్షురాలు రమాదేవి, కాంపౌండర్ ఆశ, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# అడిషనల్ తహసీల్దార్ ఆనంద్‌కు సత్కారం



**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రి మండల అడిషనల్ తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. ఆనంద్ కుమార్‌ను బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అంద జేసి, సాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హు లైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలని ఆకాంక్షిస్తూ బిఎస్పి నాయకులు ఆనంద్ కుమార్‌కు శుభా భినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరి ష్కారంలో సమర్థవంతంగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నూతన అడిషనల్ తహసిల్దార్‌కు అభినందనలు తెలి యజేస్తూ ఆయన విజయవంతమైన సేవా కాలాన్ని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.డి. మతిన్ ఖాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా కాగజ్‌న గర్ భవిత కేంద్రంలో నూతన విద్యార్థుల అడ్మిషన్లు, దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రంలో అందుబాటులో ఉన్న సేవలను దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పద్దెనిమిది సంవత్స రాల లోపు ఫిజియోథెరపీ అవసరమున్న దివ్యాంగులకు ప్రతి గురువారం, శుక్రవారం ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్ల లను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించి ఉచిత



విద్య, విభిన్న నైపుణ్యాలలో శిక్షణ అందించేందుకు తల్లి దండ్రులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్, ఐఇఆర్పి సతీష్, ఎంఆర్సి సిబ్బంది మహేష్, శ్రీకాంత్, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్

# ఆసిఫాబాద్ డిపో కొత్త కమిటీ

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎంప్లా యిస్ యూనియన్ (ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) నాయకులు డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఆలిండియా ట్రేడ్ యూని యన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు టి దివాకర్ అధ్యక్షతన ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆసిఫాబాద్ డిపో నాలు గవ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతి థులుగా టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆదిలా బాద్ రీజినల్ ప్రెసిడెంట్ శ్రీనివాసు, కార్యదర్శి అబీద్ పాషా హాజరై మాట్లాడారు. ఆర్‌టిసిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని, పెండింగ్లో ఉన్న బకాయిలు చెల్లించి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్ర మాలు చేస్తామని హెచ్చరించారు. ఆర్‌టిసి సంరక్షణ, కార్మి కుల హక్కులు ఎంప్లాయిస్ యూనియన్ తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారుగా 200 మంది కార్మికులు భారీ సంఖ్యలో ఎంప్లాయిస్ యూనియన్ లో చేరారు. అనంతరం ఆసిఫాబాద్ డిపో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రీజినల్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అబీద్ పాషా ప్రకటించారు. ఆసిఫాబాద్ డిపో నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా బోగే ఉపేందర్ (ఎఐ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి), ఛైర్మన్‌గా సి.ఎమ్. మల్లి కార్జున్, చీఫ్ అడ్వైజర్‌గా టి. దివాకర్ గౌడ్, డిపో అధ్యక్షు లుగా ఎస్. చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్. ప్రేమ్ సింగ్, డిపో కార్యదర్శిగా ఎ.అశోక్, కోశాధికారిగా జి. మోహన్ బాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జె.అశోక్, ఎన్.ఫిలిప్, వి.మబాజి, సి.ఎన్.బాబు, కె.రాగులయ్య, సహాయ కార్యదర్శులుగా ఎం.నరేష్, కె.ప్రేమ్, ఎం.సురేష్, కె.అశోక్, జాయింట్ సెక్రటరీలుగా ఖలీల్, మండలం రమేష్, దేవేందర్ కుమార్, గ్యారేజ్ కార్యదర్శిగా సిహెచ్ రవికుమార్, ఆక్సిడెంట్ కమిటీ సభ్యులుగా ప్రవీణ్, వెంక టేష్, నరసింగరావు ఎన్నికయ్యారు.

# ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం




**ప్రజాపక్షం / మందమర్రి :** యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరో గ్యాన్ని సాధించడంతో పాటు అనేక రకాల వ్యాధులను నివారించుకో వచ్చని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోత్కు సుదర్శన్, డైరెక్టర్ పుస్కూరి నర్సింగరావు, చైర్ పర్సన్ పోలు శ్రీనివాస్ పేర్కొన్నారు. మందమర్రి విలేజ్‌లోని రామాలయం సమీపంలో నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. నేటి వేగవంత మైన జీవనశైలిలో పెరుగుతున్న శారీరక, మానసిక సమస్యలకు యోగ ఒక అద్భుతమైన పరిష్కార మార్గమని తెలిపారు. యోగను ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్య వంతమైన, ప్రశాంతమైన జీవితం గడపవచ్చని వారు సూచించారు. ముఖ్యంగా యువత, మహిళలు, విద్యార్థులు యోగ సాధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. నరసింగరావు, ప్రణతి దంపతుల ఆధ్వర్యంలో మీనాక్షి యోగ, పిరమిడ్ ధ్యాన శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ సాధన వల్ల శారీ రక దృఢత్వం, మానసిక ప్రశాంతత పెరగడంతో పాటు మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను కూడా నియంత్రించుకోవచ్చ న్నారు. శిక్షణా ం ముగింపు సందర్భంగా మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే శిక్షణలో పాల్గొన్న చిన్నారులందరికీ యోగ పట్ల మరింత ఆసక్తి పెంపొందించేలా కన్సోలేషన్ బహుమతులు అందజేసి ప్రోత్సహిం చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోత్కు సుద ర్శన్, డైరెక్టర్ పుస్కూరి నర్సింగరావు, చైర్ పర్సన్ పోలు శ్రీనివాస్, యోగ మాస్టర్లు కొంపెల్లి లలిత, మీనాక్షి, లయన్స్ క్లబ్ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, తాడికొండ లూథర్ భూపాల్, బింగి రాజన్న, ఆలయ పూజారి, చిన్నారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిక



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని అమీర్‌నగర్ సర్పంచ్ నీలవేణి దశరథ్‌ను గురు వారం రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భాస్కర్, మాజీ అధ్యక్షులు రవి, ఇనాయత్‌నగర్ సర్పంచ్ బానవత్ లలిత రాములునాయక్, ఉపసర్పంచ్ అనిల్, డీసీసీ కార్యదర్శి పొడెండ్ల సంజీవ్, గ్రామశాఖ అధ్య క్షులు భూమారెడ్డి, క్యాతం గంగారెడ్డి, లిం బాద్రి, నర్సయ్య, రమేష్ శ్రావన్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వస్తువుల పంపిణీ

**ప్రజాపక్షం / వాంకిడి :** బంబారా గ్రామంలోని అంగ న్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణీలు, బాలింత మహిళ లకు ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహార వస్తువుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తోంది. ఈ నేపథ్యంలో అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ఉప్మా రవ్వ, మురుకులు, బియ్యం, గుడ్లు, పల్లి పట్టీలు, ఇతర పోషకాహార పదార్థా లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ మాట్లాడుతూ, చిన్నారులు దేశ భవిష్యత్తు అని, వారు ఆరోగ్యంగా, బలంగా ఎదగాలంటే సరైన పోష కాహారం ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా గర్భి ణీలు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల వారి ఆరోగ్యంతో పాటు పుట్టబోయే పిల్లల ఆరోగ్యానికి



కూడా మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార వస్తువులను ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళల సంక్షేమం వంటి అంశాల్లో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలి పారు. ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఉపసర్పంచ్ జాడే సంతోష్, పంచాయతీ కార్యదర్శి దుర్గం ధర్మయ్య, అంగన్వాడి టీచర్లు సువర్ణ, సరిత, అంగ న్వాడి ఆయా, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

